
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

3 జిల్లా వార్తలు

సోమవారం 6 అక్టోబరు 2025

## పంటలు పచ్చగా.. ఆనందంలో అన్నదాత

మంచాల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మంచాల మండలంలో ఈ ఏడాది సాగు చేసిన పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. నైరుతి ఆరంభంలో అంతంత మాత్రంగానే వానలు కురిశాయి. తదుపరి కురిసిన మోస్తరు వర్షాలకు వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి, పత్తి, జొన్న కూరగాయాల పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. మండల పరిధిలో 14 వేల ఎకరాలు సాగుకు పనికొచ్చే భూములుండగా.. వానాకాలంలో సుమారు 7వేల ఎకరాలకు పైగా వివిధ రకాల పంటలు వేశారు. వరి పొట్టదశకు చేరుకోగా, పత్తి చేన్లు కాత దశకు చేరుకోవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆరుట్లలో ఏపుగా పెరిగిన పత్తిచేను



మంచాలలో ఆశాజనకంగా కంది పంట



పొట్టదశలో వరి పంట



కవితతో కప్పాటి పాండురంగారెడ్డి తదితరులు

## జాగృతి ఆశయాలను వివరించాలి

» రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

కందుకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, అసమానతలను తగ్గించి, అన్నివర్గాల ప్రజలను కలుపుకుపోవడమే తెలంగాణ జాగృతి లక్ష్యమని, దీనిగురించి జిల్లా ప్రజలకు వివరించాలని రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఆదివారం జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన కార్యాలయానికి నూతనంగా నియామకమైన వారితో కలిసి వెళ్లారు. కవితను కలిసి ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో తెలంగాణ జాగృతిని మరింత విస్తృతపర్చడానికి జిల్లా నుంచే శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దీనికి జిల్లాలో కొందరికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అనంతరం పాండు రంగారెడ్డి మాట్లాడారు. తనకు జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జాగృతి నియమాలకు లోబడి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పేదల పక్షాన పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందుగుల సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కోల శ్రీనివాస్, అర్చనసేనాపతి నాయకులు ఉండెల బాబురావు, సభావట్ గణేష్‌నాయక్, రవినాయక్, సుజాత పాల్గొన్నారు.

## హైటెన్షన్ అలైన్‌మెంట్‌ను మార్చాలి

కడ్తాల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అలైన్‌మెంట్‌ను మార్చి టవర్ల నిర్మాణం పనులు నిలిపివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ భూ నిర్వాసితులు స్పష్టం చేశారు. సాగు భూముల మీదుగా 765 కేవీ విద్యుత్ హైటెన్షన్ లైన్ నిర్మాణం చేసి తమను రోడ్డు పాలు చేయొద్దని కోరారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం భూ నిర్వాసితులు సమావేశమై పోరాట కార్యాచరణ రూపొందించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందించాలని కోరనున్నట్లు వారు తెలిపారు. అలైన్‌మెంట్‌ను మార్చేవరకు ఎంతటి పోరాటాలకైనా వెనుకాడబోమన్నారు. కొందరు పారిశ్రామికవేత్తల మేలు కోసం బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ బళ్లారి నుంచి మీర్కాన్‌పేట వరకు చేస్తున్న హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చి ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు అన్యాయం చేయొద్దన్నారు. పాలక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రైతుల ఆవేదనను ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి అలైన్‌మెంట్ మార్పించాలని డిమాండ్ చేశారు.



మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారులంతా ఒక్కటయ్యారు. వారితోపాటు రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వివిధ ఉద్యోగ, వ్యాపార వర్గాల వారు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు సిండికేట్లుగా మారి దరఖాస్తు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆరేళ్ల కిందటితో పోల్చుకుంటే ఈసారి మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు అన్ని వర్గాలు పోటీ పడుతుండడం విశేషం.



## సీన్‌లోకి..

# సిండికేట్లు!

### మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు పావులు

- » కొత్త వారిని కలుపుకునేందుకు యత్నాలు
- » రంగారెడ్డి జిల్లాలో 249 మద్యం షాపులు
- » మేడ్చల్ జిల్లాలో 206..
- » వికారాబాద్ జిల్లాలో 59..

ఉమ్మడి జిల్లాలో మద్యం షాపుల వివరాలు

| | రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ |
|---|---|---|---|
| మొత్తం దుకాణాలు | 249 | 59 | 206 |
| రిజర్వుడ్ | 53 | 17 | 37 |
| అన్ రిజర్వుడ్ | 196 | 42 | 169 |
| కేటగిరీ వారీగా దుకాణాల కేటాయింపు | | | |
| ఎస్సీలు | 17 | 09 | 12 |
| ఎస్టీలు | 2 | 02 | 2 |
| గౌడ్‌లు | 34 | 06 | 23 |

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : మార్కెట్లో మద్యానికి ఉండే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొందరు ఒక్కొక్కరుగానే మద్యం దుకాణాలను దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతుండగా.. పలువురు తోడుగా కొందరు రాజకీయ నాయకులను, శ్రీమంతులను, ఇతర వ్యాపారులను జత చేసుకుని సిండికేట్‌గా మారి మద్యం దుకాణాలను దక్కించుకునేలా వ్యూహరచన చేస్తున్నారు. రంగారెడ్డిజిల్లాలో అత్యధికంగా 249 మద్యం దుకాణాలు ఉండగా, మేడ్చల్ జిల్లాలో 206, వికారాబాద్ జిల్లాలో 59 మద్యం దుకాణాలు ఉన్నాయి. మద్యం దుకాణాల కేటాయింపు (2025-27)కు సంబంధించి గత సెప్టెంబరు 26 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు వరి తేదీగా నిర్ణయించారు. ఈ నెల 23వ తేదీన దరఖాస్తులను లాటరీ తీసి



మిగతా 5వ పేజీలో...

### వికారాబాద్‌లో ఒకే ఒక్క దరఖాస్తు

ఆశావహుల నుంచి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు దాఖలయ్యేలా ఎక్సైజ్ అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రెండేళ్ల కిందట మద్యం దుకాణాలకు 2,637 దరఖాస్తులు రాగా ప్రభుత్వ ఖజానాకు రూ.52.74 కోట్ల ఆదాయం వచ్చింది. శనివారం వరకు జిల్లాలో ఒక దరఖాస్తు మాత్రమే దాఖలైంది. అయితే రెండేళ్ల కిందట వచ్చిన దరఖాస్తుల కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తాయని అధికారులు ధీమాతో ఉన్నారు. అయితే ఆసక్తి ముందు దరఖాస్తు ఫీజు పెంపు ప్రభావం అంతగా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మేడ్చల్ ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని మద్యం దుకాణాలకు శనివారం వరకు 20 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మేడ్చల్ డివిజన్ పరిధిలో 118 మద్యం దుకాణాల కోసం ఇప్పటివరకు 20 దరఖాస్తులు దాఖలయ్యాయి.

## నేటి ప్రజావాణి రద్దు

» కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నేడు (సోమవారం) జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు, ఫిర్యాదుదారులు ఈ విషయమై జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.




షీల్డ్ అందుకుంటున్న కానిస్టేబుల్ చందన్‌సింగ్

## పరుగు పందెంలో కానిస్టేబుల్ ప్రతిభ

కడ్తాల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పరుగు పందెం పోటీల్లో కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లోవిధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చందన్‌సింగ్ ప్రతిభ కనబర్చాడు. ఆదివారం కడ్తాల మండల పరిధిలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో తెలంగాణ అల్ట్రా మారథాన్ ఆధ్వర్యంలో 5 కిలోమీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. దీంట్లో చందన్‌సింగ్ మొదటి బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా చందన్‌సింగ్‌ను సీఐ గంగాధర్, ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, సిబ్బంది అభినందించారు.

# ఏళ్లు గడుస్తున్నా..!

## పూర్తికాని బూర్గుల రైల్వే అండర్ పాస్ నిర్మాణం

**మూడేళ్లుగా కొనసాగుతున్న పనులు**

**ఇబ్బందులు పడుతున్న 12 గ్రామాల ప్రజలు**



బూర్గుల రైల్వే అండర్ పాస్ కింద నిలిచిన నీరు

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రైల్వే అంటేనే నమ్మకం.. కానీ మూడేళ్లుగా బూర్గుల రైల్వే అండర్ పాస్ పనులు కొనసాగుతుండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు స్వగ్రామమైన బూర్గుల గ్రామ పంచాయతీ పరిధిలోని కాశిరెడ్డిగూడ వద్ద బూర్గుల గ్రామం పేరుతో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశారు. సుమారు 12 గ్రామాలు సదరు రైల్వే గేట్ దాటుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. రైలు వచ్చే సమయంలో గేట్ వేయడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. దశాబ్దాల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న

మిగతా 6వ పేజీలో...

### అవస్థలు పడుతున్నాం



మూడేళ్లుగా రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నాం. అండర్‌పాస్ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయడం లేదు. గ్రామానికి రావాలంటే చుట్టూ 12 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుంది. ఎవరికి చెప్పాలో తెలియడం లేదు.

- కుమార్ గౌడ్, కాశిరెడ్డిగూడ



### కుక్కల స్వైరవిహారం..
## జనం బెంబేలు

- మూగజీవాలపై దాడితో రైతుల ఆందోళన
- రేబిస్ సోకే అవకాశం ఉందని నిపుణుల సూచన

6

### పరిషత్ పోరుకు
## పార్టీల సన్నద్ధం

- గ్రామాల్లో వేడెక్కిన రాజకీయాలు
- అభ్యర్థుల ఎంపికలో తలమునకలు
- గెలుపు గుర్రాల కోసం అన్వేషణ

6



కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

**కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి**

కందుకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా సత్తా చాటాలని పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. దసరా పండగను పురస్కరించుకొని పీసీసీ ప్రధానకార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్‌లు ఆదివారం తుక్కుగూడలోని కిచ్చనగారి క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కందుకూరు, మహేశ్వరం మండలాల్లోని జెడ్పీటీసీ, ఎంపీపీలతో పాటు పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్తినేని వెంకట్‌రాంరెడ్డి, ఇ.రామచంద్రారెడ్డి, చిర్రసాయిలు, కె.రాణాప్రతాప్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.సురేందర్, కె.మదన్‌పాల్ రెడ్డి, రాజేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్‌స్టేషన్ సీఐ సత్యనారాయణ అన్నారు. ఆదివారం యాచారం మండల పరిధిలోని మీరాఖాన్‌పేట్‌లో శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రాత్రివేళ దొంగతనాలు జరగకుండా గ్రామస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొత్త వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నేటి యువత, విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్, డ్రగ్స్, గంజాయి బారినపడి విలువైన జీవితాలను కోల్పోవద్దని తెలిపారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని కోరారు. ఎస్సై వంశీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చేవెళ్ల డివిజన్‌లో భారీవర్షం



పత్తి పొలంలో చేరిన నీరు

చేవెళ్ల డివిజన్‌లో శనివారం అర్ధరాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ తదితర మండలాల్లో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పిడుగు శబ్దానికి చేవెళ్లలోని నవచైతన్య పాఠశాల భవనంపై ఉన్న వాటర్ ట్యాంకు పగిలిపోయిందని యాజమాన్యం తెలిపింది. కాగా భారీ వర్షం కారణంగా మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే పంటపొలాల్లో వర్షం నీరు నిలువడంతో రైతులు ఆందోళన చెందారు. ఆదివారం సాయంత్రం కూడా చేవెళ్ల పట్టణంలో వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారిపై నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

చేవెళ్ల, అక్టోబరు 5 ( ఆంధ్రజ్యోతి)

» నాలుగు మండలాల్లో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు



చేవెళ్లలో ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



## తుల్జాపూర్ భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

తాండూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తాండూరు నుంచి తుల్జాపూర్ భవానీ మాతను దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులకు ఆదివారం హిందూ ఉత్సవ కేంద్ర సమితి, ఓంకార్ సేవా సమితి సభ్యులు అన్నప్రసాదం, అల్పాహారం పంపిణీ చేశారు. షోలాపూర్ నుంచి పాదయాత్రగా వెళ్లే భక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తాండూరు రైల్వేస్టేషన్ వద్ద అల్పాహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నర్సిములు, పర్యాదరామకృష్ణ, అశోక్ ఉన్నారు.

# టంగటూరు రోడ్డును పట్టించుకోరూ?

- అడుగడుగునా గుంతలతో వెతలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు, వాహనదారులు
- మరమ్మతులు చేయించని అధికారులు

శంకర్‌పల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): టంగటూరు తారు రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. దీంతో గ్రామస్తులు, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ లేచిపోయి ఏర్పడిన గోతులతో వాహనదారుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. రోడ్డు బాగుచేయించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు లే డు. చేవెళ్ల-శంకర్‌పల్లి ప్రధాన రోడ్డు నుంచి గ్రామం వరకు 3కి.మీ ఉన్న ఈ బీటీ రోడ్డుపై వెళ్లే వారు నిత్యం నరకం చూస్తున్నారు. ద్విచక్ర వాహనదారులైతే మరి న్ని ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ప్రయాణం చేయాలంటే ఎక్కడ ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతుల గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. 20ఏళ్ల క్రితం ఈ తారు రోడ్డు వేయగా, ప్రస్తుతం అది పాడైంది. ఈ గుంతల రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. గ్రామం నుంచి నిత్యం చేవెళ్ల, శంకర్‌పల్లి, వికారాబాద్ పట్టణాలకు, వివిధ గ్రామాలకు వెళ్తున్న వారికి కష్టాలు తప్పడంలేదు. సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇబ్బందులు పడలేక గ్రామస్తులు ఇటీవల రోడ్డుపై మొరంతో తాత్కాలికంగా గుంతలను పూడ్చారు. వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికైనా మరమ్మతులకు నిధులు మంజూరు చేసి ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఎక్కడికక్కడ గుంతలుపడిన రోడ్డు



### రోడ్డుపై ప్రయాణం భయంగా ఉంది



గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటే భయంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నిత్యం గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారైనా గుంతలు పూడ్చిన పాపాన పోలేదు. ఈ రోడ్డుపై చేవెళ్ల, వికారాబాద్, శంకర్‌పల్లితో పాటుగా తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి గ్రామస్తుల కష్టాలు తీర్చాలి.

**- శ్రీనివాస్, టంగటూరు**

### రహదారిని అధికారులు బాగు చేయించాలి



రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో ప్రయాణించేందుకు వీలు లేకుండా ఉంది. పాడైన రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు రోడ్డు బాగు చేయిస్తారని ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నాం. అధికారులు ఇప్పటికైనా మా గ్రామస్తుల ఇబ్బందులను తీర్చాలి.

**- గోపాల్, మాజీ సర్పంచ్, టంగటూరు**

## పంచాయతీ కార్యదర్శి తీరుపై దళిత సంఘాల ఆగ్రహం



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం మొండిగౌరెల్లి పంచాయతీ కార్యదర్శి తీరుపై దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి కవర్ కట్టడంతో ఆదివారం దళిత సంఘాల నాయకులు విగ్రహం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ ... స్వాతంత్ర సమరయోధుడు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పంచాయితీ కార్యదర్శి పాలిథీన్ కవర్ కట్టడం ఏమిటిని ప్రశ్నించారు. జగ్జీవన్ రామ్ రాజకీయా నాయకుడు కాదని, ఆయన దళితుల ఆశాజ్యోతి అన్నారు. పాలిథీన్ కవర్ తొలగించకుంటే నిరాహార దీక్షకు పూనుకుంటామన్నారు. విషయం తెలుసుకున్న ఏంపీవో శ్రీలత పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్నికి ఎస్సై మధు చేరుకొని జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఉన్న కవర్‌ను తొలిగించారు. కవర్ కప్పిన వాళ్లపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పడంతో దళిత సంఘాల నాయకులు ఆందోళన విరమించుకున్నారు.

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



బహుమతులు అందుకున్న క్రీడాకారులు

దుద్యాల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ అన్నారు. దుద్యాల జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పది రోజులుగా నిర్వహించిన దసరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన ఎలెవన్ స్టార్ జట్టుకు ఆదివారం ఆయన బహుమతులు అందజేశారు. శేఖర్ మాట్లాడుతూ.. వయసుతో సంబంధం లేకుండా క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమి గెలుపునకు నాంది అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, నిర్వాహకులు నరేందర్‌గౌడ్, సంతోష్, అనిల్, విష్ణువర్ధన్, గ్రామస్తులు శ్రీకాంత్, నిసార్, ఫరీద్, రాజేశ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన పొదలు

యాచారం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిన్నతూండ్ల-నందివనపర్తి రోడ్డు పక్కన సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దాని చుట్టూ ముళ్లకంపచెట్లతో నిండిపోయింది. రోడ్డుకు ఆనుకొని ఉండడంతో ఏదైనా వాహనం ప్రమాదవశాత్తు తగిలితే ప్రాణాలు గాలిలో కలవడం ఖాయం. అలాగే ఇక్కడ పశువులు సంచరస్తుంటాయి. ట్రాన్స్‌ఫార్మర్‌తో వాటికీ ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ వేసి చుట్టూ పొదలను తొలగించాల్సిన ట్రాన్స్‌కో అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు తెలిపారు.



చిన్నతూండ్లలో రోడ్డు పక్కన పొదల్లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

# వరి పంటకు అగ్గి తెగులు

- అధిక వర్షాలు, వాతావరణ మార్పులతో సోకుతున్న చీడపీడలు
- తెగుళ్ల బెడదతో రైతుల ఆందోళన
- సూచనలతో పురుగు మందులు వాడాలంటున్న అధికారులు

దౌల్తాబాద్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వరిలో తెగుళ్ల బెడద అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. పంటలను చీడపీడలు ముప్పేట దాడి చేస్తున్నాయి. వరి పంటను అగ్గి తెగులు ఆశించి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా నెల రోజుల పాటు ఎడతెరిపిలేని వర్షాలతో వరి పంటకు అగ్గి తెగులు సోకుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంటలకు చీడపీడలు సోకిన వెంటనే రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించకుండా నేరుగా ఎరువులు, పురుగు మందుల వ్యాపారుల దగ్గరికి వెళ్లడం పరిపాటిగా మారింది. దీంతో పురుగు మందుల వ్యాపారులు అవసరం లేని మందులను అంటగట్టి రైతుల నుంచి డబ్బులను దండుకుంటున్నారు. ఈ విషయంలో రైతులు తమ క్లస్టర్ పరిధి వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే వాడాల్సిన మందులను, అవసరమైన మోతాదులో సూచించే వీలుంటుంది.



దేవరఫస్లాబాద్‌లో అగ్గి తెగులు సోకిన వరి పైరు

**ఎండుతున్న చేను**

ఎడతెరిపి లేని వర్షాలతో పాటు వాతావరణంలో మార్పుల కారణంగా వరి పంటకు అగ్గి తెగులు సోకేందుకు కారణంగా మారుతోంది. తెగులు సోకిన పైరుపై ట్రైసైక్లోజోన్ 0.6గ్రాములు లేదా ఐసోప్రోథలిన్ 1.5 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

**యాజమాన్య పద్ధతులు**

రైతులు భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా సిఫార్సు చేసిన ఎరువులనే వాడాలి. ఎకరానికి 50 నుంచి 60 కేజీల నత్రజని, 24 కేజీల భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. 16 నుంచి 20 కేజీల నత్రజని, 24 కిలోల భాస్వరం, 8కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను చివరి దమ్ములో వేసుకోవాలి. భాస్వరాన్ని కాంప్లెక్స్ రూపంలో వేయకూడదని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**తక్కువ మోతాదులో నీరు ఉంచాలి**

వరి పంటలో నీటి యాజమాన్యాన్ని సక్రమంగా చేపడితే పోషకాల వినియోగం ఎక్కువై కలుపు ఉధృతి తగ్గుతుంది. వరి నాట్లు వేసేటప్పుడు 1.2 సెం.మీ వరకు నీరు పలుచగా ఉంచాలి. నాటిన తర్వాత నీటి మట్టాన్ని 5 సెం.మీ వరకు పెట్టాలి. నాటు వేసిన పది రోజుల తర్వాత పైరు దుబ్బు చేయడం పూర్తయ్యే వరకు నీటిని రెండు, మూడు సెం.మీ మాత్రమే ఉండాలి. నీటిని ఆదా చేసేందుకు ఆరుతడి విధానాన్ని అనుసరించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

షాబాద్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో షాబాద్ గడ్డపై బీజేపీ జెండాను ఎగరవేద్దామని మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామానికి చెందిన వశిష్ఠ విద్యా సంస్థ ఛైర్మన్ మ్యాతరి అశోక్ ఆధ్వర్యంలో 150 మంది నర్సింహులు, యాదయ్య, సురేష్, దేవేందర్‌గౌడ్, రాజు, వెంకటయ్య, సత్యనారాయణ, స్వామి, రాఘవేందర్, ఆంజనేయులు తదితరులు బీజేపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక ఎన్నికల్లో షాబాద్ గడ్డపై కమలం జెండా ఎగరాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దూరి మాణయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మహేందర్, మల్లేష్, రాజు, వివేక్, నరేశ్, శ్రీశైలం, హరికృష్ణ, శ్రీకాంత్, నవీన్, నందు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

తార్నాక, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయితీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించొద్దని నాచారం సీఐ ధనుంజయ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలను ఇబ్బంది పెట్టేలా, సమావేశాలు, డీజేలు, మైకులు వంటివి ఉపయోగించొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# కడ్తాల్‌లో బస్టాండ్ ఏర్పాటు .. కలేనా?

- ప్రయాణ ప్రాంగణం.. ప్రతిపాదనలకే పరిమితం
- బస్సుల కోసం హోటళ్లు, దుకాణాల వద్ద నిరీక్షణతో ప్రయాణికుల ఇక్కట్లు
- రోడ్డుపైనే బస్సుల నిలిపివేత
- అమలుకు నోచుకోని ప్రజాప్రతినిధుల హామీలు



బస్టాండ్ లేక కడ్తాల్‌లో ప్రధాన రోడ్డుపై నిలుపుతున్న ఆర్టీసీ బస్సులు

కడ్తాల్,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానికి చేరువలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న కడ్తాల మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు కలగానే మిగిలింది. నేతల హామీలకే పరిమితమైంది. 20ఏళ్లుగా బస్టాండ్ ఏర్పాటు ప్రతిపాదనల్లోనే నిలిచింది. బస్టాండ్ లేక ప్రయాణికులు, ప్రజలు ఏళ్ల కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ నిర్మాణ విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. అనేక మండలాలకు కూడలిగా ఉన్న కడ్తాలలో బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా స్పందన కరువైంది. బస్టాండ్ నిర్మాణానికి పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు పంపినా అవి బుట్టదాఖలయ్యాయి. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న పట్టణంలో బస్టాండ్ లేక బస్సులను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

**వందలాది మంది రాకపోకలు...**

ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, కందుకూరు మండలాలకు చెందిన వందలాది మంది ప్రయాణికులు, ప్రజలు రోజూ కడ్తాల నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కడ్తాల మీదుగా హైద రాబాద్, శ్రీశైలం, వరంగల్, యాదగిరిగుట్ట, షాద్‌నగర్, ఇబ్రాహీంపట్నం, సంగారెడ్డి, జహీరాబాద్, హన్మకొండ, కర్ణాటక, అచ్చంపేట, మాల్, దేవరకొండ తదిత పట్టణాలకు పదుల సంఖ్యలో బస్సులు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలకు సాగిస్తున్నారు. కాగా బస్టాండ్ లేక రోడ్ల పక్కన, హోటళ్లు, దుకాణాల వద్ద నిల్చొని బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఎండ, వాన కాలంలో ప్రయాణికుల ఇబ్బందులు చెప్పనలవి కావు. జిల్లాకు చెందిన అనేక మంది ప్రజాప్రతినిధులు, పలువురు మంత్రులు, అధికారులు బస్టాండ్ ఏర్పాటుకు హామీ ఇచ్చినా నేటికీ అమలు నోచుకోలేదని స్థానికులు వాపోతున్నారు. కనీసం పనులైనా మొదలు పెట్టలేదని, స్థలాన్ని కూడా కేటాయించలేదని అంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులకు బస్టాండ్ ఏర్పాటు కోసం వినతి పత్రాలు అందజేశారు. ఏర్పాటు చేస్తామన్న హామీనే తప్ప కార్యాచరణ లేదన్న విమర్శలున్నాయి. జాతీయ రహదారిపై ఉన్న ఇక్కడ బస్టాండ్ లేక పెద్దలోటుగా, సమస్యగా మారిందని స్థానిక ప్రజాప్రతినిధులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకొని బస్టాండ్ ఏర్పాటుకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### ఏళ్లుగా తప్పని ఇబ్బందులు



కడ్తాలలో బస్టాండ్ లేక ఏళ్ల కాలంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఏర్పాటు దిశగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజలు విధి లేక హోటళ్ల, దుకాణాల వద్ద నిల్చొని బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. అనువైన స్థలం కేటాయించి బస్టాండ్ నిర్మాణం చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.

**- దోనాదుల మహేశ్, కడ్తాల్**

### ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాం



కడ్తాల నుంచి అనేక ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ గురించి ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాం. ఆర్టీసీ ఉన్నతాధికారులు, మంత్రులకు విన్నవించాం. ఎమ్మెల్యే, ఎంపీ బస్టాండ్ విషయంలో చొరవ చూపాలి.

**- లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్, కడ్తాల**

### బస్టాండ్ నిర్మాణానికి కృషి



కడ్తాల్‌లో బస్టాండ్ నిర్మాణం గురించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఆర్టీసీ అధికారులు, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు విన్నవించాం. ఆర్టీసీ ముందుకు వస్తే స్థలం కేటాయిస్తాం. బస్టాండ్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

**- హన్మానాయక్, నాయకుడు, కడ్తాల్**



బీసీ సెల్ పట్టణాధ్యక్షుడిగా నియామకమైన కిషోర్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## స్థానిక ఎన్నికలకు కాలయాపన చేస్తున్న ప్రభుత్వం

» మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశం సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు కాలయాపన చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం తన నివాసంలో నాయకులతో సమావేశం నిర్వహించి వికారాబాద్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎంబీజీ కాలనీకి చెందిన కిషోర్‌ను నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, తెస్తున్న ఆర్డినెన్స్‌లు, బిల్లులు, జీవోలు అన్నీ నాటకాలేనన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధి లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాటకాలన్నీ జరుగుతున్నాయని, ప్రజలను మోసగించడంలో సీఎం దిట్ట తెలిపారు. 42శాతం రిజర్వేషన్లపై ఇచ్చిన జీవోను తన అనుచరులతోనే కోర్టు వివాదాల్లోకి లాగి ఎన్నికలను వాయిదా వేయించాలనే ప్రణాళికతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ మోసాన్ని బీఆర్ఎస్ తరుపున ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపాల్, మాజీ కౌన్సిలర్ అనంత రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామస్వామి, మల్లికార్జున్, సుభాన్‌రెడ్డి, ముర్తుజాఅలీ, మల్లేశ్, రమణ, వేణుగోపాల్, బూర్గుపల్లి అనంతరెడ్డి, ఫరీద్, నరసింహ, వరుణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

### చార్జీల పెంపుతో ప్రయాణికుల జేబుకు చిల్లు

ఆర్టీసీ టికెట్ల ధరల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల జేబుకు చిల్లు పెడుతోందని మెతుకు ఆనంద్ అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్లలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఒక్క స్టేజీకి రూ.5 నుంచి రూ.10 వరకు చార్జీలు పెంచడం అన్యాయం అన్నారు. ఫ్రీ బస్సు స్కీంతో ఆర్టీసీ ఆర్థికంగా కుదేలైందని, ఆ భారాన్ని ఇప్పుడు టికెట్లు తీసుకునే వారిపై నెడుతున్నారని ఆరోపించారు. ఓ వైపు ఉచిత ప్రయాణం అంటూనే మరోవైపు అదనపు చార్జీల రూపంలో వసూలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ గెలుపునకు పాటుపడాలి



మాట్లాడుతున్న చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్

శంకర్‌పల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీం భరత్ అన్నారు. శంకర్‌పల్లిలో ఆదివారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజాసంక్షేమానికి పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉందని, ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యం అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఉదయ్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రకాశ్, ఎజాస్, శేరి అనంతరెడ్డి, యాదయ్య, యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, శంకర్, బద్దం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## వృద్ధులకు అండగా లయన్స్ క్లబ్




సమావేశంలో మాట్లాడుతున్న మహేంద్రకుమార్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో ఆమనగల్లు లయన్స్ క్లబ్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉందని లయన్స్‌క్లబ్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. వయోవృద్ధులకు క్లబ్ అండగా ఉంటుందన్నారు. కడ్తాలలో క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహేంద్రకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆమనగల్లు లయన్స్ క్లబ్, బాలాజీ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లు అందజేస్తునట్లు పాషా తెలిపారు. లయన్స్‌క్లబ్ సేవలను గ్రామాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ చెన్న కిషన్‌రెడ్డి, మాజీ వైస్ గవర్నర్ సురేశ్ జిగ్నాని, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు, నాయకులు శ్రీకాంత్, జనార్దన్‌రెడ్డి, జూలూరి లింగయ్య, ఓంకారం, రమేశ్, మిట్టపల్లి అంజయ్య, సునంద, గుజ్జరి నర్సింహ పాల్గొన్నారు.

## అలయ్ బలయ్‌తో ప్రజల్లో స్నేహభావం పెంపు

శంకర్‌పల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అలయ్ బలయ్ కార్యక్రమంతో స్నేహభావం పెంపొందుతుందని సామాజిక సమరసత కంద కన్వీనర్ లక్ష్మారెడ్డి అన్నారు. సామాజిక సమరసత ఆధ్వర్యంలో ఆదివారం శంకర్‌పల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అలయ్ బలయ్‌తో ఐకమత్యం, మానవతా దృక్పథం అలవడుతాయని అన్నారు. కార్యక్రమంలో టీచర్లు రఘునందన్‌రెడ్డి, తాహెర్ అలి, మునీర్ పాషా, శ్రీను, శ్రీధర్‌రెడ్డి, రాములు, గోపాల్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.



అలయ్ బలయ్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు

# సీన్‌లోకి.. సిండికేట్లు!

(మూడో పేజీ తరువాయి)

దుకాణాలు కేటాయించనున్నారు. లాటరీలో దుకాణం దక్కిన వారికి 2025 డిసెంబర్ 2 నుంచి 2027 నవంబర్ 30 కాలపరిమితితో రెండేళ్లపాటు లైసెన్స్ జారీ చేస్తారు.

### ఇక్కడి దుకాణాలకు ఫుల్ డిమాండ్

మద్యం దుకాణాల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, గౌడ్‌లకు కొన్ని షాపులు రిజర్వ్ చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం ఉమ్మడి జిల్లా నుంచే వస్తుండడంతో ఇక్కడ షాపులకు ఎనలేని డిమాండ్ ఉంది. కొత్త మద్యం దుకాణాల కేటాయింపుకు సంబంధించి దరఖాస్తు రుసుము రూ.3 లక్షలుగా నిర్ణయించారు. ఇది నాన్ రీఫండబుల్ కావడంతో దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి ఉమ్మడి జిల్లా నుంచి రూ.వెయ్యి కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. గతంలో దరఖాస్తుల స్వీకరణ ద్వారా రూ.800 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. ఒక్క రంగారెడ్డి జిల్లాలో 21,615 దరఖాస్తులు రాగా వీటి ద్వారా రూ.432.30 కోట్ల ఆదాయం వచ్చింది.. ఇప్పుడు సిండికేట్లు లేకుంటే ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే మద్యం వ్యాపారుల సిండికేట్ల కారణంగా ఈ సారి ఆదాయంపై సందిగ్ధత నెలకొంది.

### ఎక్కడైనా వారిదే హవా

రెండేళ్ల కిందట జరిగిన డ్రాలో జిల్లాలో చాలా వరకు సిండికేట్లే మద్యం దుకాణాలు దక్కించుకోగా,



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

పరిగి, వికారాబాద్, తాండూరు సర్కిళ్ల పరిధిలో ఎక్కువ మద్యం దుకాణాలను సిండికేట్లు దక్కించుకున్నారు. జిల్లాలో ఓ సిండికేట్ గ్రూపు ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, హైదరాబాద్ జిల్లాల పరిధిలో 999 దరఖాస్తులు దాఖలు చేయగా, అదే ప్రాంతానికి చెందిన మరో సిండికేట్ గ్రూపు 666 దరఖాస్తులు వేసిన విషయం తెలిసిందే. ఐదు సర్కిళ్ల పరిధిలోనూ సిండికేట్ల హవానే కొనసాగింది. వికారాబాద్ జిల్లాలో 2021లో 59 మద్యం దుకాణాలకు 837 దరఖాస్తులు రాగా, 2023లో ఏకంగా 2,637 దరఖాస్తులు వచ్చాయి. వికారాబాద్ సర్కిల్ పరిధిలో 15 మద్యం దుకాణాలకు 866 దరఖాస్తులు రాగా, తాండూరు సర్కిల్ పరిధిలో 18 దుకాణాలకు 583, పరిగి సర్కిల్ పరిధిలో 12 దుకాణాలకు 564, కొడంగల్ సర్కిల్ పరిధిలో 8 దుకాణాలకు 275, మోమిన్‌పేట సర్కిల్ పరిధిలో 6 దుకాణాలకు 349 దరఖాస్తులు వచ్చాయి. అప్పట్లో జిల్లాలో అత్యధికంగా వికారాబాద్ సర్కిల్ పరిధిలోని నవాబ్‌పేట్ మద్యం దుకాణానికి 95 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా తాండూరు సర్కిల్ పరిధిలోని తట్టేపల్లిలోని మద్యం దుకాణానికి 17 దరఖాస్తులు వచ్చాయి.

### కలిసికట్టుగా రంగంలోకి...

ఎస్సీ, ఎస్టీ, గౌడ్‌లకు కేటాయించిన మద్యం దుకాణాలను సులువుగా చేజిక్కించుకునేందుకు కలిసికట్టుగా రంగంలోకి దిగుతున్నారు. కొత్త వారు కూడా ఈ వ్యాపారంలో అడుగు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. నోటిఫికేషన్ విడుదల కాకముందు నుంచే మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చలు కొనసాగుతున్నాయి. రిజర్వేషన్ వర్గాలకు కేటాయించిన దుకాణాలకు దక్కించుకునేందుకు ఆయా వర్గాల వారి పేరుతో దరఖాస్తులు వేయించాలని వ్యాపారులు పావులు కదుపుతున్నారు. డ్రాలో ఎంపికైతే సంబంధిత వ్యక్తి తమ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించకుండా అన్ని విధాలుగా ముందుగానే రాతపూర్వకంగా ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్కీ డ్రాలో దుకాణం దక్కించుకున్న వారే మద్యం దుకాణం నిర్వహించాలి. బినామీలు దుకాణం నిర్వహించకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నా పలు చోట్ల గుడ్‌విల్ ఇచ్చి నడిపిస్తున్న ఉదంతాలు కూడా కొనసాగుతున్న విషయం తెలిసిందే.



కీసరలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించిన స్వయం సేవకులు

## పంచ పరివర్తనతో సమాజ కల్యాణం

కీసర, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పంచ పరివర్తనతో సమాజ కల్యాణం సాధ్యం అవుతుందని మల్కాజ్‌గిరి గోసేవ ప్రముఖ్ పంతంగి బాలమురళీకృష్ణ, ఆర్ఎస్ఎస్ కుషాయిగూడ నగర కార్యవాహ్ దొంతి సాయిరామ్‌రెడ్డి అన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యశతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం కీసరలో విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించారు. స్వయం సేవకులు గణవేషతో కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలమురళీకృష్ణ, సాయిరాంరెడ్డిలు మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సమాజంలో సమూల మార్పు కోసం పంచ పరివర్తన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కుటుంబ ప్రబోధన్, సామాజిక సామరస్యత, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ, పౌర నియమాలు అనే ఈ ఐదు నియమాలతో సమాజంలో మార్పు కోసం ప్రతి పౌరుడు కృషిచేయాలని పిలుపునిచ్చారు.



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మాజీ వైస్‌చైర్మన్ రెడ్డియా నాయక్

## వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

ఘట్‌కేసర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్యులు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలను పొందాలని పోచారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాష్‌నగర్ కాలనీలో ఆదివారం వైద్యులు శివకృష్ణ, రమేష్‌లు సంయుక్తంగా ఏర్పాటుచేసిన మెరాకిల్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సాయిరెడ్డి, స్థానికులు మల్లేష్, సుబ్బారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ

చౌడాపూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పరిగి కరుణాకర్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా పరిగి నర్సిములు, సలహాదారులుగా ఆంజనేయులు, దాసు, ప్రసాద్, ప్రభు, రాములు, దాసరి రామకృష్ణ, చెన్నయ్య, రాములు, ప్రభాకర్, శ్రీను, కృష్ణయ్య, గోవర్ధన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఆర్వోల నియామకం

## స్థానిక ఎన్నికలకు రిటర్నింగ్ అధికారుల కేటాయింపు

» జెడ్పీటీసీ ఎలక్షన్లకు ఆర్వోలుగా జిల్లా, డివిజనల్ ఆఫీసర్లు

» ఎంపీటీసీ ఆర్వోలుగా గెజిటెడ్ అధికారులు



వికారాబాద్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ నెల 9వ తేదీ నుంచి మొదటి విడత పరిషత్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లలో అధికారులు వేగం పెంచారు. స్థానిక ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించే రిటర్నింగ్ అధికారుల(ఆర్వో) నియామక ప్రక్రియ పూర్తయింది. జెడ్పీటీసీ ఎన్నికల కోసం ప్రతి మండలానికి ఒక రిటర్నింగ్ అధికారి వంతున జిల్లాలో 20 మండలాలకు 20 మందిని నియమించారు. వివిధ శాఖల జిల్లా, డివిజనల్ అధికారులను జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా ఎంపిక చేశారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం, బరిలో నిలిచే అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన వంటి అన్ని పనులూ రిటర్నింగ్ అధికారులే నిర్వహించాలి. ఫలితాలు వెల్లడించేంత వరకు రిటర్నింగ్ అధికారులు ఎన్నికల విధుల్లో ఉంటారు. ఎన్నికల ప్రక్రియలో వీరి పాత్ర ప్రధానం.

### 72 ఎంపీటీసీ క్లస్టర్లు...

ఎంపీటీసీ ఎన్నికలకు గెజిటెడ్ హోదా కలిగిన జూనియర్ లెక్చరర్లు, ఎంఈవోలు, హెడ్‌మాస్టర్లు, డిప్యూటీ ఈఈ, ఏఈఈ, ఇతర అధికారులను రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. జిల్లాలో 227 ఎంపీటీసీ స్థానాలకు 72 క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో క్లస్టర్‌లో మూడు నుంచి నాలుగు ఎంపీటీసీ స్థానాలను కేటాయించారు. నామినేషన్లు స్వీకరణకు క్లస్టర్లవారీగా ఒక రిటర్నింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఉంటారు. 72 క్లస్టర్లకు 72 మంది రిటర్నింగ్ అధికారులు, 72 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉండగా, అదనంగా 17 మంది రిటర్నింగ్ అధికారులు, 17 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను రిజర్వులో ఉంచారు. క్లస్టర్ పరిధిలోని ఎంపీటీసీ స్థానాల నిమినేషన్ల స్వీకరణ నుంచి గుర్తులు కేటాయించే వరకు వారే పర్యవేక్షించాల్సి ఉంటుంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల దాఖలు ప్రక్రియ అంతా ఎంపీడీవో కార్యాలయంలోనే నిర్వహిస్తారు. ఎంపీటీసీ రిటర్నింగ్ అధికారులే జడ్పీటీసీ రిటర్నింగ్ అధికారికి సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు.

| | |
|---|---|
| జెడ్పీటీసీ స్థానాలు | 20 |
| రిటర్నింగ్ అధికారులు | 20 |
| ఎంపీటీసీ స్థానాలు | 227 |
| ఎంపీటీసీ క్లస్టర్లు | 72 |
| ఆర్వోలు | 72 |
| ఏఆర్వోలు | 72 |
| రిజర్వులో.. | |
| రిటర్నింగ్ అధికారులు | 17 |
| అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు | 17 |

**జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు**

| మండలం | ఆర్వో | హోదా |
|---|---|---|
| బంట్వారం | శ్రీనివాస్ | జిల్లా ఆడిట్ అధికారి |
| బషీరాబాద్ | సుదర్శనం | జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి |
| బొంరాస్‌పేట్ | రాంరెడ్డి | ఏడీ, సర్వే అండ్ ల్యాండ్ రెవెన్యూ |
| ధారూరు | రాజేశ్వరి | జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి |
| దోమ | శ్రీధర్‌రెడ్డి | ఈఈ, ఆర్అండ్‌బీ |
| దౌల్తాబాద్ | సుదర్శన్‌రావు | డిప్యుటీ ఈఈ, పీఆర్ |
| కొడంగల్ | రవి | ఈఈ, మిషన్ భగీరథ |
| కోట్‌పల్లి | బి.వాల్యానాయక్ | అసిస్టెంట్ కమిషనర్ కార్మిక శాఖ |
| కులకచర్ల | వెంకటయ్య | జిల్లా మత్స్య శాఖ అధికారి |
| మర్పల్లి | మోహనకృష్ణ | డీఎం, సివిల్ సప్లయిస్ |
| మోమిన్‌పేట్ | డాక్టర్ సదానందం | జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి |
| నవాబ్‌పేట్ | రాజరత్నం | జిల్లా వ్యవసాయాధికారి |
| పరిగి | మాధవరెడ్డి | డిప్యూటీ ఈఈ, పీఆర్ |
| పెద్దేముల్ | సత్యనారాయణ | ఏడీ, మైన్స్ |
| పూడూరు | మహేశ్వర్ | డిప్యూటీ డైరెక్టర్, ఇండస్ట్రీస్ |
| తాండూరు | నాగభూషణం | డిప్యూటీ ఈఈ, పీఆర్ |
| వికారాబాద్ | శ్రీనివాస్ | డిప్యూటీ ఈఈ, పీఆర్ |
| యాలాల్ | సారంగపాణి | ఏడీ, మార్కెటింగ్ |
| చౌడాపూర్ | ఉమేష్ | ఈఈ, పీఆర్ |
| దుద్యాల్ | సత్యనారాయణరెడ్డి | ఈఈ, తాండూరు |

# ఆరోగ్యానికి ఊతం.. చిరుధాన్యాలు





## వినియోగంతో రక్తంలో గ్లూకోజ్ స్థాయిల నియంత్రణ

» రోగ నిరోధకత పెంపు

» తృణధాన్యం.. కాలుష్య రహితం!

» పాత పంటల ఆహారంపై ప్రజల ఆసక్తి

షాబాద్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మానవ జీవన శైలిలో వచ్చిన మార్పులతో పల్లె, పట్టణం అనే తేడాల్లేకుండా ఎంతో మంది రకరకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ప్రధానంగా బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక రుగ్మలతో ఎంతో మంది సతమతమవుతున్నారు. చిన్న వయసులోనే వివిధ రకాల వ్యాధులబారిన పడుతున్నారు. ఆహార అలవాట్లు, దైనందిక జీవనంలో ఒత్తిళ్లు, మితిమీరి ఆలోచనలను అధికమించేందుకు వివిధ ఆరోగ్య సూత్రాలను పాటిస్తున్నారు. యోగా, ధ్యానంతో పాటు ఆహార అలవాట్లను మార్చుకుంటున్నారు. అందులో భాగంగానే చాలామంది చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో తీసుకుంటున్నారు.

### మిల్లెట్ల విశిష్టత

పీచు పదార్థం కలిగి ఉండటమే చిరుధాన్యాల ప్రత్యేకత. వీటిని ఆహారంలో భాగంగా చేసుకుంటే మనిషికి అవసరమైన 25-30గ్రాముల పీచు పదార్థం(ఫైబర్‌కాంటెంట్) లభిస్తుంది. ఓ మధ్య వయస్కుడైన వ్యక్తికి రోజుకు 40గ్రాముల ఫైబర్ అవసరం. మూడు పూటలా తృణ ధాన్యాలను ఆహారంగా తీసుకుంటే 30గ్రాముల వరకు పీచుపదార్థం లభిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మిగతా 10గ్రాముల పీచుపదార్థాలు, కూరగాయలు, ఆకు కూరల ద్వారా పొందొచ్చు. తృణధాన్య ఆహారంతో రోగ నిరోధకత పెరుగుతుంది. వీటిల్లో కొర్రలు, అరికలు, సామలు, అండుకొర్రలు, ఊదలు అనే ముఖ్యమైన రకాలు ఉంటాయి. తటస్థ ధాన్యాలుగా సజ్జలు, రాగులు, ఒరిగలు, జొన్నలు, మొక్కజొన్నలను పిలుస్తారు.





### పీచు పదార్థంతో గ్లూకోజ్‌కు చెక్!

మన ఆహారంలో ఉండే సహజ పీచుపదార్థం రక్తంలోకి గ్లూకోజ్‌ను విడుదల చేసే ప్రక్రియను నియంత్రిస్తుంది. గ్లూకోజ్ ఎక్కువ మొత్తంలో విడుదల చేయాలా లేదా.. తక్కువ మొత్తాల్లో కొద్ది గంటల పాటు విడుదల చేయాలా? అనేది ఆహారంలో ఉండే పీచుపదార్థమే నిర్ణయిస్తుంది. అధిక గ్లూకోజ్‌తో షుగర్(మధుమేహ) వ్యాధి వస్తుంది కాబట్టి అవగాహన ఉన్న వారు అధిక పీచుపదార్థాలున్న చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటున్నారు. పీచు పదార్థాలు జీర్ణక్రియకు సహకరిస్తాయి. ఈ విధానంతో ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చు. అప్పటికే వ్యాధులు ఉన్న వారు వాటిని నియంత్రణలో ఉంచొచ్చు.





### ప్రజల్లో అవగాహన పెరగాలి



చిరుధాన్యాల వాడకంపై ప్రజల్లో అవగాహన పెరగాలి. రైతులు పండించిన ధాన్యాలు మా వద్ద లభిస్తాయి. కొర్రలు, సాములు, ఊదలు, అండ్రు కొర్రలు, అరికలు, రాగులు, సజ్జలు మేం అమ్మకాలు సాగిస్తున్నాం. వీటి ఆవశ్యకత తెలిసినవారే కొంటున్నారు. అయితే ఇప్పుడిప్పుడే ప్రజల్లో మిల్లెట్ ఫుడ్‌పై ప్రజలు తెలుసుకుంటున్నారు. నేడు ఆహారం కలుషితమవుతున్న తరుణంలో సిరిధాన్యాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.

- గడ్డం కిషోర్‌గుప్తా, వ్యాపారి, షాబాద్

### శరీరంలో కొవ్వును తగ్గిస్తాయ్



నేను ఆరు నెలల నుంచి సాములు, అరికెలు, కొర్రలు ఆహారంలో తీసుకుంటున్నా. దీని వల్ల ఆరోగ్యం బాగుంది. బాడీలో కొవ్వుశాతం తగ్గింది. శరీరం తేలికగా అన్పిస్తోంది. తృణధాన్యాల్లోని సహజ పోషకాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు. ఇది నిరూపణైంది. ఇవి ఎక్కువ తింటే శరీరానికి అలసట అనేది ఉండదు.

- మహేశ్, ఆస్పల్లిగూడ

ఫేస్ టు ఫేస్

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**మహేశ్వరం జోన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్‌రావు**

మహేశ్వరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు వాహన దారులందరూ విధిగా తగిన జాగ్రత్తలు, నియమ నిబంధనలు పాటించేలా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని మహేశ్వరం జోన్ ట్రాఫిక్ సీఐ జి. వెంకటేశ్వర్‌రావు తెలిపారు. వాహనదారులు పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకోవాలని తెలిపారు. ఈమేరకు ట్రాఫిక్ రూల్స్, తదితర విషయాలను ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

**మహేశ్వరం జోన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?**

మహేశ్వరం జోన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రజలతో పాటు వాహన దారులకు అవగాహన కల్పిస్తున్నాం.

**డ్రంకెన్ డ్రైవ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

మద్యం సేవించి వాహనాలు నడిపేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. వీలు దొరికినప్పుడల్లా కౌన్సిలింగ్ ఇస్తున్నాం. మద్యం సేవించి డ్రైవ్ చేస్తే వాహనాలను సీజ్ చేసి వ్యక్తులపై కేసులు నమోదుచేసి కోర్టుకు పంపిస్తున్నాం.

**చాలామంది ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లపై వాహనాలు పార్క్ చేస్తున్నారు? ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?**

ప్రధాన రహదారుల్లోని ఫుట్‌పాత్‌లపై వాహనాలు నిలుపకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో తనిఖీలు చేయిస్తున్నాం. ఫుట్‌పాత్‌లపై ఎవరైనా వాహనాలు పార్క్ చేస్తే సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు కూడా నమోదు చేస్తున్నాం.

# కుక్కల స్వైరవిహారం.. జనం బెంబేలు

- మూగజీవాలపై దాడితో రైతుల ఆందోళన
- రేబిస్ సోకే అవకాశం ఉందని వైద్యుల సూచన



నందిగామ మండల కేంద్రంలో కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు(ఫైల్)



రంగాపూర్‌లో కుక్కల దాడిలో మృతిచెందిన నాటుకోళ్లు(ఫైల్)



నందిగామ మండల కేంద్రంలో గుంపుగా తిరుగుతున్న శునకాలు

నందిగామ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ సింహాలు(కుక్కలు) స్వైరవిహారం చేస్తున్నాయి. నియంత్రణ లేకపోవడంతో గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రతీ గ్రామంలో పదుల సంఖ్యలో గుంపులుగా తిరుగుతూ ప్రజలని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల నందిగామ మండల కేంద్రానికి చెందిన దాసరి శివకుమార్ యాదవ్‌కు చెందిన 20 గొర్రెలు కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోగా, రైతు సత్తయ్యకు చెందిన లేగదూడ సైతం కుక్కల దాడిలో మృతి చెందింది. అదేవిధంగా నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ శివారులో నాటుకోళ్ల షెడ్డుపై కుక్కలు దాడిచేసి సుమారు 300 కోళ్లను ప్రాణాలు తీయడంతో పాటు మండలంలోని తాటిగడ్డతండాకు చెందిన జటావత్ మోహన్‌నాయక్‌కు చెందిన మేకల మందపై దాడి చేసి 5మేకలను చంపాయి. చిన్నపిల్లలు బయటకి వెళితే వెంబడించి కరిచిన సంఘటనలూ అనేకమున్నాయి.

### కుక్కల వల్ల పెరుగుతున్న ప్రమాదాలు

రోడ్లపైకి కుక్కలు అకస్మాత్తుగా దూసుకొస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చాలామంది ఆసుపత్రుల్లో చేరి చికిత్స తీసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో కాళ్లు, చేతులు విరిగి ఆపరేషన్లు తప్పనిసరి అవుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాలతో పాటు రహదారులపై ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది.

### ప్రాణాలు కోల్పోతున్న మూగజీవాలు

మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్లు కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా ఆవులు, లేగదూడలు, మేకలు, గొర్రెలు, కోళ్లను కుక్కల బారి నుంచి కాపాడుకోవడం రైతులకు తలకుమించిన భారం అవుతుంది. మరోవైపు గొర్రెలు, మేకల పెంపకదారులు వీధి కుక్కలతో తీవ్రంగా నష్టపోతున్నారు.

### చిన్నారులకు తప్పని ముప్పు

కుక్కల దాడికి గురైన అనేక మంది చిన్నారుల హృదయవిదారక సంఘటనలు అనేకం. వీధిలో ఆడుకుంటున్న, పాఠశాలలకు, గ్రామాల్లో షాపులకు వెళ్లే పిల్లలు కుక్కల బారిన పడుతున్నారు. కుక్కల సంఖ్య లెక్కకు మించి పెరిగిపోవడంతో ఆహారంకోసం విచ్చలవిడిగా దాడులు చేస్తున్నాయి. దీంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళనతో తమ పిల్లలనీ బయటకి పంపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామాల్లో రేబిస్ ముప్పు పొంచి ఉంది. కుక్కల సంఖ్యపై నియంత్రణ లేకపోవడంతో చాలావరకు రకరకాల వ్యాధులతో పోరాడుతున్నాయి. అటువంటి కుక్కలు దాడిచేసినా, వీధుల్లో ఎక్కువగా సంచరించినా రేబిస్ ముప్పు తప్పదని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

### పట్టించుకునే వారే కరువయ్యారు?

తరచూ కుక్కల దాడులు పెరిగిపోతున్నా అధికార యంత్రాంగం మాత్రం నిశ్శబ్దంగా ఉంది. మూగజీవాలు చనిపోతున్నా, చిన్నారుల ప్రాణాలకు ముప్పు ఉన్నా, రేబిస్ ముప్పు పొంచి ఉన్నా మాకేం సంబంధం అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో కుక్కలతో పోరాడే పరిస్థితి వస్తుందేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు బాధ్యత తీసుకోవాలి**

ఇటీవల కుక్కల దాడిలో నేను పెంచుకున్న 23 గొర్రెలు చనిపోయాయి. చిన్నారులే కాదు రైతులు ఒంటరిగా పొలం వద్దకు వెళ్లాలన్నా భయంగా ఉంది. అధికారులు స్పందించకపోవడం శోచనీయం. కుక్కల దాడిలో అనేక మూగజీవాలు మృతిచెందినా ఒక్క అధికారి కూడా బాధితులకు భరోసా ఇవ్వలేదు.

- దాసరి శివ, బాధిత రైతు, నందిగామ

**ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటోంది**

రోజురోజుకూ కుక్కల వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది గాయపడుతున్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటోంది. అకస్మాత్తుగా జరుగుతున్న ఈ ప్రమాదాలు కొన్నిసార్లు ప్రాణాంతకంగా కూడా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్సలు తప్పనిసరి అవుతోంది.

- శ్రీనివాస్‌రెడ్డి, వైద్యుడు

**చర్యలు తీసుకుంటాం**



మండలంలోని కొన్ని గ్రామాల్లో కుక్కల దాడిలో మూగజీవాలు మృతి చెందిన ఘటనలు మా దృష్టికి వచ్చాయి. గ్రామాల్లో కుక్కల తీవ్రతపై చర్యలు తీసుకుంటున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.

- సుమతి, ఎంపీడీవో, నందిగామ

## డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన టీఎస్‌ఎస్‌వో చీఫ్



తలకొండపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినివాస్ ఆదివారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి రఘురామ కృష్ణంరాజును శాలువాతో సన్మానించారు. టీఎస్‌ఎస్‌వో ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించినట్లు ఈ సందర్భంగా లక్ష్మినివాస్ పేర్కొన్నారు.

## క్రైం కార్నర్

### ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ రాయపోల్ రోడ్డులో ఉన్న విష్ణుపురి కాలనీలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మంచాల మండల కేంద్రానికి చెందిన గడ్డం గణేశ్(36) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ఇంటినుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం ఇబ్రహీంపట్నం టౌన్‌లో విష్ణుపురి కాలనీలో ఓ చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో అక్కడ బస్తీవాసులు డయల్ 100కు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

కొత్తూర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పారిశ్రామికవాడలోని ఓ ఐరన్ పరిశ్రమలో ఐరన్ రాడ్స్ మీద పడి తీవ్ర గాయాలకు గురైన ఓంప్రకాశ్(40) అనే కార్మికుడు మృతి చెందినట్లు ఎస్సై గోపాలకృష్ణ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన ఓంప్రకాశ్ కొంత కాలంగా పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 3న రాత్రి పరిశ్రమలో కూలింగ్ బెడ్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఓంప్రకాశ్‌పై వేడిగా ఉన్న ఐరన్ రాడ్స్ కుడి భుజం మీదపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి చిన్నాన్న బీర్బల్‌రామ్ శనివారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కార్యకర్తల సమావేశంలో నూకం రాజు

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

మంచాల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని సత్తా చాటాలని బీజేపీ మంచాల మండలాధ్యక్షుడు నూకం రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చాడు. మండల పరిధి ఆరుట్లలో ఆదివారం నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కొత్తపల్లి శేఖర్, మెండు శ్రీనివాస్‌రెడ్డి, పాండాల జంగయ్యగౌడ్, మహేందర్, కొంగర జనార్ధన్‌రెడ్డి, కొంగర వెంకట్‌రెడ్డి, గంట నర్సింహారెడ్డి, మెండు వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, మహేందర్, మంద మోహన్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సత్యనారాయణ, నరేందర్‌గౌడ్, పెద్దిరెడ్డి యాదగిరిరెడ్డి, రవీందర్‌రెడ్డి, గంట రాజు, దయాకర్‌రెడ్డి, సంతోష్, అచ్చన రవీందర్, కందాల నరేష్, ప్రసాద్‌రెడ్డి, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిషత్ పోరుకు పార్టీల సన్నద్ధం

- గ్రామాల్లో వేడెక్కిన రాజకీయాలు
- అభ్యర్థుల ఎంపికలో పార్టీల తలమునకలు
- గెలుపు గుర్రాల కోసం నేతల అన్వేషణ



ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం

ఆమనగల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి నామినేషన్ల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పల్లెల్లో రాజకీయాలు వేడెక్కాయి. జడ్పీటీసీలకు, ఎంపీటీసీలకు ఈనెల 23న మొదటి విడత ఎన్నికల నేపథ్యంలో ఆశావాహులు టిక్కెట్ల కోసం పార్టీ అధిష్ఠానం, అగ్రనేతల ప్రాపకం కోసం ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. తమకు అభ్యర్థిత్వం ఖరారు అవుతుందో లేదోనన్న టెన్షన్ ఆశావాహుల్లో నెలకొంది. పార్టీ నేతల మద్దతు కూడ గట్టుకునేందుకు ఎత్తుగడలు సాగిస్తున్నారు. ఆమనగల్లు ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు జనరల్‌కు కేటాయించడంతో ఈసారి అన్ని పార్టీల నుంచి అభ్యర్థిత్వాలకు పోటీ తీవ్రంగానే ఉంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక అధికార, ప్రతిపక్ష నేతలకు తలనొప్పిగా మారింది. అధికార కాంగ్రెస్‌లో జడ్పీటీసీ స్థానానికి పోటీ తీవ్రంగా ఉండడంతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

**జడ్పీటీసీ ఆశావహులు వీరే..**

ఆమగగల్లు జడ్పీటీసీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, చెంచు సంఘం రాష్ట్ర నాయకులు, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లీ రాములు, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కల్లు రమణారెడ్డిలు ఆసక్తి చూపుతున్నారు. బీఆర్ఎస్ నుంచి ఆపార్టీ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఏఎంసీ మాజీచైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, రాంనుంతల మాజీసర్పంచ్ శ్రీనునాయక్ పేర్లు తెరపైకి వచ్చాయి. బీజేపీ నుంచి మంగళపల్లికి చెందిన తిప్పిరెడ్డి విష్ణువర్దన్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.

## జెడ్పీటీసీగా అవకాశం కల్పించాలి

ఆమనగల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు జెడ్పీటీసీగా తనకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నాయకుడు, పోలెపల్లి మాజీ ఉప సర్పంచ్ దారెడ్డి అంజన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేశానని, జనరల్‌కు కేటాయించిన జెడ్పీటీసీ స్థానంలో తనకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి అంజన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, భగవాన్‌రెడ్డి, రవిప్రకాశ్, అఖిల్, శాంతన్,శ్రీను, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న దారెడ్డి అంజన్‌రెడ్డి

## బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని యాచారం మండల బీఆర్ఎస్ నాయకులు మారోజ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల అభ్యర్థుల గురించి చర్చించడం జరిగిందన్నారు. పార్టీ అధిష్ఠానం సూచన మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ పోటీలో ఉన్న అభ్యర్థుల గెలుపు కొరకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా సర్పంచుల ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ మద్దతుదారులను గెలిపించుకునే బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో నందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమీషన్ ఏజెంట్లు ఇష్టానుసారంగా వ్యవహరించొద్దు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి

శంకర్‌పల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు కూరగాయలు తీసుకొచ్చే రైతుల నుంచి కమీషన్ ఏజెంట్లు ఇష్టానుసారంగా ముట్టి తీస్తే చర్యలు తప్పవని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి హెచ్చరించారు. శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం వైస్‌చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతులు పండించిన కూరగాయలను అమ్ముకునేందుకు బీట్లకు తీసుకురాగా, ఏజెంట్లు ఇష్టం వచ్చినట్లుగా ముట్టి తీయడం ఏంటని ఆమె ప్రశ్నించారు. కూరగాయలకు అరకిలో, ఉల్లిగడ్డకు కిలో తీసుకోవాలని సూచించారు. ఏజెంట్లు ముట్టి ఎక్కువగా తీసుకోవడంతో కూరగాయలు, ఉల్లిగడ్డలు తదితర పంటలను శంకర్‌పల్లి మార్కెట్‌లో అమ్ముకునేందుకు రైతులు ఆసక్తి కనబరచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలకు అరకిలో, ఉల్లిగడ్డకు కిలో తీసుకునే విధంగా తీర్మానం చేసి మార్కెట్‌లో రైతులకు తెలిసే విధంగా బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె స్పష్టంచేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులను స్థానిక ఎమ్మెల్యే యాదయ్య అమ్ముకున్నారని కొందరు లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు ఉంటే చూపించాలని, బట్టికాల్చి మీద వేయడం మానుకోవాలని హితవు పలికారు. నిరాధార ఆరోపణలు చేస్తే ఇక చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో డైరెక్టర్లు మల్లేషం, సర్తాజ్, ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీహరి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏళ్లు గడుస్తున్నా..!

(మూడో పేజీ తరువాయి)

ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో రైల్వే శాఖ అండర్ పాస్ నిర్మాణ పనులు ప్రారంభించారు.



పగుళ్లు వచ్చిన రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు(ఫైల్)

### మూడేళ్లుగా సాగుతున్న పనులు

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని రైల్వే శాఖ ఎలాంటి పనులు చేపట్టినా త్వరితగతిన పూర్తి చేస్తుంది. కానీ బూర్గుల రైల్వే అండర్‌పాస్ నిర్మాణం అందుకు విరుద్ధంగా జరుగుతుంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా మూడేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు కూడా పూర్తి నాణ్యతతో చేపట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అండర్ పాస్ పైకప్పు రంధ్రాలు పడిందని పలువురు తెలిపారు. రిటైర్నింగ్ వాల్ కూడా నాణ్యతగా నిర్మించక పోవడంతో పగుళ్లు వచ్చాయి. అవి కనిపించకుండా సిమెంట్ పూశారు. వర్షం కురిసినప్పుడు బ్రిడ్జి కింద నీరు నిలిచి ప్రజలు, వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నీరు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా నరకం చూస్తున్నామని ఈ సందర్భంగా వారు చెబుతున్నారు.

### తప్పని దూరభారం

నత్తనడకన సాగుతున్న అండర్ పాస్ నిర్మాణం వల్ల సుమారు 15 గ్రామాల ప్రజల మూడేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి వద్ద నిత్యం రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రైల్వే గేట్ పక్కన ఉన్న కాశిరెడ్డిగూడ గ్రామస్తులు ఇంటికి వెళ్లాలంటే సుమారు 12 కిలోమీటర్ల దూరం నుంచి రావాల్సి ఉంటుంది. బూర్గుల, చింతగూడ, కాశిరెడ్డిగూడ, నేరెళ్లచెర్వు, కుందేలుకుంట తండా, కడియాలకుంట తండా, మధురాపూర్, హెమాజీపూర్ గ్రామాల ప్రజలు బూర్గుల గేట్ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం కడియాలకుంట తండా మీదుగా సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణం చేసి గ్రామానికి చేరుకోవాల్సి ఉంటుంది. లేదంటే సోలీపూర్, చిల్కమర్రి మీదుగా బూర్గుల వెళ్లాల్సి ఉంటుంది. ఆపద సమయంలోనూ ఈ దూరభారం తప్పడం లేదని ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా బూర్గుల శివారులో పలు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వాటి వద్దకు రాకపోకలు సాగించాలన్నా ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అండర్ పాస్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**పనులు త్వరగా పూర్తి చేయాలి**



అండర్ పాస్ పనులు త్వరగా పూర్తి చేయాలి. వ్యవసాయానికి అవసరమైన సామన్లు తెచ్చుకోవాలంటే ఇబ్బంది అవుతుంది. కనీసం కింది నుంచి కూడా నడవలేని పరిస్థితి ఉంది. అధికారులు చొరవ తీసుకోవాలి.

- యాదయ్యగౌడ్, కాశిరెడ్డిగూడ

## హరీశ్‌రావును కలిసిన గోలి శ్రీనివాస్‌రెడ్డి



హరీశ్‌రావుతో గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఆమనగల్లు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావును ఆదివారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందలతో కలిసి హరీశ్‌రావును సత్కరించారు. తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర విషయాలపై చర్చించినట్లు గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## సాయన్న ఆశయాలను కొనసాగిస్తాం



సాయన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోరాట యోధుడు పండుగల సాయన్న ఆశయాలను కొనసాగిస్తామని చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఊరడి నర్సింలు తెలిపారు. మున్సిపల్ కేంద్రంలో పండుగల సాయన్న విగ్రహావిష్కరణ చేసి రెండు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం ముదిరాజ్ సంఘం నాయకులు సాయన్న విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయన్నను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. యువజన సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శివరాజ్, రాంప్రసాద్, గణేష్, బాలయ్య, శ్రీనివాస్, భిక్షపతి, అంజయ్య, జనార్దన్, గోపాల్, నర్సింలు తదితరులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య కళాశాల పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో సమావేశమైనారు. 2007-2009 సంవత్సరంలో ఇంటర్ చదివిన విద్యార్థులు ఆ నాటి అధ్యాపకులతో సమావేశమై గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కళాశాల డైరెక్టర్ కరుణాకర్ నేతృత్వంలో వేడుకలను జరుపుకున్నారు. చేస్తున్న వృత్తి, కుటుంబాల పరిస్థితులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వర్ధన్‌రెడ్డి, అంజలి, భవాని, కృష్ణ మోహన్, శ్రీధర్ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న భక్తులు

కేశంపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోమాల్‌పల్లి-కొండారెడ్డిపల్లి గుట్ట సమీపంలో ఆదివారం శివాలయం పునఃనిర్మాణానికి భూమిపూజ చేశారు. వేంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ కంచుకోట సత్యనారాయణ, కంచుకోట యాదగిరి, ప్రేమ్‌కుమార్‌గౌడ్‌లు తమ కుటుంబ సభ్యులతో కలిసి భూమి పూజ చేశారు. గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి, బాల్‌రాజ్, వేణు, రమేష్, నరసింహ, వెంకటేష్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

కొందుర్గు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిధిలోని ఆగిర్యాల గ్రామానికి చెందిన పోతుల సత్యమ్మ గత కొన్ని రోజులు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. సత్యమ్మ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన తెలిపారు. అనంతరం మృతురాలు సత్యమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.



సత్యమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న కృష్ణారెడ్డి